క్లుప్తంగా

రిలే దీక్షలు ప్రారంభం



దీక్ష చేపట్టిన ఎన్ఎంయూ కార్మికులు

నరసాపురం: ఎన్ఎంయూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ స్థానిక డిపోలో కార్మికులు రెండు రోజుల రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో డిపో ఎన్ఎంయూ కార్యదర్శి టీఎస్ ప్రసాద్, కేపీ సురేష్‌బాబు, కె.చంద్రరావు, ఇ. వెంకటరావు, బి.సురేష్‌బాబు, జి. రామకృష్ణ కూర్చున్నారు. అక్రమ సస్పెన్షన్లు ఆపాలని, అనారోగ్య సెలవులు జీతంతో కలిపి ఇవ్వాల ని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మహిళా కార్మికులకు చైల్డ్‌కేర్ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పార్టీ అభివృద్ధికి కృషి



భాస్కరరావుకు కృతజ్ఞతలు చెబుతున్న స్టాలిన్‌బాబు

యలమంచిలి: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా సంస్థాగత కార్యదర్శి ఓదూరి భాస్కరరావును సోమవారం ఉచ్చుల స్టాలిన్‌బాబు కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పార్టీ నాయకులు వీరా ఉమా శంకర్, మంద హరికుమార్, పితాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో భూ సారం పెంపు



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాప్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: భూమిలో సారవంతం పెరగాలంటే నవధాన్యాలతో పాటు 14 రకాలు జాతులు మొలకలను సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక (కాప్) డివిజన్ ఇంఛార్జ్ అప్పారావు అన్నారు. సోమవారం పాలకొల్లు మండలం కాపవరం, వడ్లవానిపాలెం గ్రామాల్లో కాప్ 2025–26 ప్రణాళిక కింద గ్రామస్థాయి పద్ధతి వ్యవసాయ ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నవధాన్యాలు పప్పుజాతి, పచ్చిరొట్ట, చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు వంటివి ఇలా 14 రకాల జాతులు ఉంటాయని, అవన్నీ కలిపి వేయడం వల్ల భూమిలో నత్రజని, భాస్వరం, పొటాషియం పెరుగుతాయని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాలు వేస్తే భూమిలో ఉండే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం గ్రామంలో కాప్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోలాటి రాధా, ఉప సర్పంచ్ అంగర వీరభద్రకుమార్, సెక్రటరీ డి.శ్రీనివాస్, ఏఈఓ సాయిమణి, వీహెచ్ వెంకటలక్ష్మి, సత్యసాయిబాబు పాల్గొన్నారు.

సులభంగా నిర్మాణ అనుమతులు

నరసాపురం: మున్సిపాలిటీలో సులభంగా భవన నిర్మాణ అనుముతుల పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య తెలిపారు. అనుమతి ఉన్న లేఅవుట్లు, గ్రామకంఠం భూముల్లో నిర్మాణాలు చేయాలనుకునేవారు స్వీయ ధ్రువీకరణ, అంగీకారపత్రం సమర్పించాలని పేర్కొన్నారు.

కాలువను ప్రక్షాళన చేయాలి

నర్సాపురం రూరల్: నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పంట, మురుగు కాలువలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి సాగునీటి పారుదలకు ఆటంకాల్లేకుండా చూడాలని నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం మాజీ సర్పంచ్ కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు ప్రభుత్వాన్ని నరసాపురంలో సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సార్వా పంట ఒకటే ఉండేదని, మంత్రి అల్లూరి సత్యనారాయణ రాజు రెం డో పంటగా దాళ్వాకు అనుమతి తీసుకొచ్చారని గుర్తుచేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే కింది ప్రాంతాలకు పంట నీరు అందక రైతులు పడుతున్న బాధను గ్రహించి రుస్తుంబాద నుంచి క్రింది ప్రాంతాలకు పరకాల శేషవతారం పేరుతో కాలువ నిర్మించారని తెలిపారు. ఆ కాలవ నేడు ఆక్రమణలకు గురైందని ఆరోపించారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పంట కాలువలు, మురుగు కాలువల్లో ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఉండేదని, నేటి ప్రభుత్వాలు అభివృద్ధి వ్యాపారంగా మార్చారని ఆరోపించారు. కాలువల్లో పూడిక తీత, గుర్రపు డెక్క తొలగింపు వంటి పనులు చేపట్టడంతో క్రింది ప్రాంతాలకు పంట నీరు సక్రమంగా పారేదని, మురుగు కాలువ కూడా సక్రమంగా ఉండేదని కానీ ఇప్పుడు మురుగు కాలువలు ఆక్రమణలకు గురి కావడంతో నీటి పారుదల లేక పంటకు నీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని కూనపురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

పది ఫలితాల్లో సర్కారు విద్యార్థుల సత్తా

ఇంగ్లిష్ మీడియంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు

పెనుమంట్ర: ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా సర్కారు స్కూళ్ల ఇంగ్లిషు మీడియం విద్యార్థులు సత్తా చాటారు. గతంలో ఉత్తీర్ణత, ర్యాంకుల సాధన ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులకు మాత్రమే సొంతంగా ఉండేది. అటువంటిది గత ఐదేళ్లగా సర్కారు స్కూళ్ల ఇంగ్లిషు మీడియం విద్యార్థులు ఆ ఘనతను దక్కించుకుంటున్నారు. ఇందుకు వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడమే. ఇంగ్లిష్ మీడియంకు అవసరమైన ఉపాధ్యాయులను కూడా నియమించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువులపై పిల్లలు ఆసక్తి చూపారు. అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత

పెనుమంట్ర మండలంలో ఏడు ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది పదో తరగతిలో 365 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 254 మంది మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 234 మంది విద్యార్థులు ఇంగ్లిషు మీడియం కాగా, 20 మంది మాత్రమే తెలుగు మీడియంలో విద్యాభ్యాసం చేసిన వారు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి ఏ మేరకు ముందుకు సాగిందో ఈ ఫలితాలే ఉదాహరణగా పేర్కొనవచ్చు. జుత్తిగ ఉన్నత పాఠశాల నుంచి 45 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 25 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో కండెల్లి జ్యోత్స్న అనే విద్యార్థిని 578 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. పాలమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 41 మంది పరీక్షలు రాయగా, 32 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో దారపురెడ్డి దుర్గా తులసి 577 మార్కులతో, తన సోదరుడు శ్రీకర ఫణి 545 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. నెగ్గిపూడి జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల నుంచి 34 మంది పరీక్షలు రాయగా 32 మంది మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఇందులో పెనుమంట్రకు చెందిన అమిరపు జశ్వంత్‌కుమార్ 577 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. పెనుమంట్ర జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 81 మంది పరీక్షలు రాయగా, 44 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో గోడి జ్యోత్స్న 564 మార్కులతో, మార్టేరు బాసంతి దేవి బాలికోన్నత పాఠశాలలో 34 మందికి 28 మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో కంకటాల నాగ వెంకట సాయి 564 మార్కులతో, మార్టేరులో శ్రీవేణు గోపాల ఉన్నత పాఠశాలలో 57 మందికి 44 మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో జీసీఎస్ రామమోహన్ 562 మార్కులతో, మాముడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 29 మందికి 26 మంది ఉత్తీర్ణత సాధించగా పి.ఉమా మహేష్ 514 మార్కులతో ఆయా పాఠశాలల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.



తల్లి నాగలక్ష్మితో కండెల్లి జ్యోత్స్న



తల్లి చంద్రకళతో గోడి జ్యోత్స్న



తల్లి దారపరెడ్డి వెంకట కుమారితో అన్నాచెల్లెళ్లు శంకర ఫణి, దుర్గా తులసి

ఉత్తమ ఫలితాలు



పదో తరగతి విద్యార్థులకు గతంకన్నా భిన్నంగా ప్రత్యేక బోధనా కార్యక్రమాలు నిర్వహించాం. ప్రత్యేక సెలవు దినాల్లో కూడా వెనుకబడిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చాం. ఏ గ్రేడు విద్యార్థులకు మెరుగైన బోధన అందించాం. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించగలిగాం.

– ఉంగరాల నాగేశ్వరరావు, ఎంఈఓ, పెనుమంట్ర

ఉపాధ్యాయుల సమష్టి కృషి



ఉపాధ్యాయుల సమష్టి కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం జిల్లా విద్యాశాఖ ఆదేశాను సారం ప్రత్యేక ప్రణాళిక ద్వారా బోధన అంశాలను మెరుగుపర్చడంతో మంచి ఫలితాలు వచ్చాయి. ప్రతిరోజు క్రమం తప్పకుండా సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక తరగతులు మంచి ఫలితాలు రావడానికి దోహదపడ్డాయి.

– రెడ్డి మణిభారతి, ప్రధానోపాధ్యాయిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, జుత్తిగ

పార్టీ ప్రచార వింగ్ రాష్ట్ర కార్యదర్శికి అభినందనలు



కెనడిని అభినందిస్తున్న జై భీమ్ ఆర్మీ ఫౌండేషన్ సభ్యులు

నరసాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రచార వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రముఖ న్యాయవాది, దళిత నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇంజేటి జాన్ కెనడిని సోమవారం రుస్తుంబాద గ్రామం మంగళగుంట పాలెంలో జై భీమ్ ఆర్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి ఎంతగానో సేవలందిస్తున్న కెనడీ నియామకం అభినందనీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో జై భీమ్ ఆర్మీ ఫౌండేషన్ అధ్యక్షులు పిల్లి నవరత్నం, కార్యవర్గ సభ్యులు వర్దనపు సుధాకర్, డి హార్లీ, పిల్లి మనోహరం, నేతల రమేష్, దాసరి రాజు, గోరింకల వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

వేసవి భత్యాన్ని పునరుద్ధరించాలి



ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పెనుగొండ: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న పనులకు వేసవి భత్యాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ పెనుగొండ మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. సోమవారం సిద్ధాంతం పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తోన్న ఉపాధి హామీ హామీ పనులను ఆయన పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలకు వేసవి భత్యం, తాగునీరు, తాత్కాలిక నీడ, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఇటీవల గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, వాటిని ఆపాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

పల్లాలమ్మకు వెండి గరగ సమర్పణ



పల్లాలమ్మకు సమర్పించిన వెండి గరగ

పెనుగొండ: పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ ఆలయంలో పల్లాలమ్మవారికి దాతలు 5 కేజీల వెండి గరగను దాతలు బహుకరించినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి ఆదిమూలంవెంకట సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆలయంలో తూర్పు గోదావరి జిల్లా మండపేటకు చెందిన పిల్లి సత్యనారాయణ గరగను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవోతో పాటు, దాతలు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కాలుష్యం కోరల్లో రామలింగేశ్వరుడు





కోనేటిలో ఉన్న బురదమట్టి, అభిషేకద్రవ్యాలను మోటారు ద్వారా ప్రదక్షిణ మండపం నుంచి తోడుతున్న దృశ్యం

పెనుమంట్ర: సత్తారామేశ్వరంలోని గోస్తనీ నదిలో వేంచేసి ఉన్న పరశురామ ప్రతిష్ఠ శ్రీసప్త కోటి రామలింగేశ్వరునికి వైశాఖ మాసంలో కూడా కాలుష్య బారినుండి తప్పించుకునే అవకాశాన్ని దేవదాయశాఖ అధికారులు కల్పించలేకపోయారు. దీంతో సోమవారం ఆలయానికి వచ్చిన భక్తులు దుర్గంధం మధ్యనే ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. ఏటా వైశాఖ మాసం ప్రారంభంలోనే కోనేటిలోని నీటి, సిల్టును బయటకు తరలించేవారు. ఆలయం చుట్టూ పారిశుద్ధ్య పనులను చేపట్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసేవారు. అయితే ఈ ఏడాది నీటిని తొలగించారు కోనేటిలో అడుగున ఉన్న మట్టిని తొలగించ లేదు. బ్లీచింగ్ కూడా చల్లలేదు. దీంతో కోనేటిలో దుర్గంధ భరిత వాతావరణం నెలకొంది. అంతేకాకుండా ఆలయంలో స్వామివారికి అభిషేకించిన పాలు, నీరు కూడా మోటారు ద్వారా తిరిగి ప్రదక్షిణ చేసే ప్రదేశం నుంచి బయటకు తోడటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆలయ ఈఓ యాళ్ల సూర్యనారాయణను సాక్షి వివరణ కోరగా కోనేటిలో నీటిని అర్చకులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం తొలగించాల్సి ఉందని, ఆమేరకు రెండు రోజుల్లో కోనేటిలో ఉన్న బురదను కూడా తొలగించి పారిశుద్ధ్య పనులు చేపడతామని చెప్పారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



సమావేశమైన వైఖానస సంఘ సభ్యులు

నరసాపురం రూరల్: వివిధ ఆలయాల్లో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న శ్రీవైఖానస సంఘ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ఐక్యంగా పరిష్కరించుకుందామని ఆ సంఘ సభ్యులు తీర్మానించారు. సోమవారం నరసాపురం తాలూకా శ్రీవైఖానస సంఘ సమావేశం స్థానిక రాజగోపాల స్వామి ఆలయంలో నిర్వహించారు. అర్చకులు అభివృద్ధికి కొన్ని తీర్మానాలు చేశారు. పహల్గాంలో ఉగ్రవాదదాడిలో ప్రాణాలు కోల్పోయిన హిందువులందరికీ మౌనం పాటించి నివాళులర్పించారు. గౌరవ అధ్యక్షులు పెద్దింటి కేశవాచార్యులు, సంఘ అధ్యక్షుడు పెద్దింటి వేణుగాపాలచార్యులు, ప్రధాన కార్యదర్శి పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు, ఆగమ సలహదారు ప్రముఖ సిద్ధాంతి పెద్దింటి అనీల్ కుమార్, సుదర్శనం లక్ష్మీనర్సింహాచార్యులు, వైఖానస యువసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



గ్రంథాలయంలో ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం



పెనుమంట్ర : మార్టేరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

పాలకొల్లు సెంట్రల్: శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగుతాయి. నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి అముద్రిత కథలు చెప్పటం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించను న్నారు. పిల్లలు గ్రంథాలయాలకు వచ్చి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారిణి వి.శాంత కుమరి కోరారు.

మార్టేరులో..

పెనుమంట్ర: మార్టేరు శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి ప్రారంభించారు. ప్రతి విద్యార్థీ మంచి పుస్తకాన్ని కొనుక్కోవడం అలవర్చుకోవాలని, పుస్తక పఠనం ద్వారా విద్యాభివృద్ధిని పొందవచ్చని అన్నారు. పుస్తక పఠనం చేయడం దినసరి కార్యక్రమం కావాలని మానవత సంస్థ అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి అన్నారు. రిటైర్డు తహసీల్దార్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, మానవతా కార్యదర్శి ఎస్ మురళీకృష్ణ, ఇంగ్లిషు ఉపాధ్యాయిని పడాల సువర్ణగౌరీ గ్రంథాలయాధికారి పీటీఎస్ కుమార్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణా ముఖ్యమే



విద్యార్థిని సోఫియాను సన్మానిస్తున్న హెచ్ఎం, గ్రామస్తులు

యలమంచిలి: ప్రతి విద్యార్థికి చదువుపాటు క్రమశిక్షణ ముఖ్యమని కాజ తూర్పు గ్రామంలోని పింగళి వెంకయ్య ఓరియంటల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మహ్మద్ లియాకత్ ఆలీ అన్నారు. ఆ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని కొలాటి సోఫియా 2024–25 విద్యా సంవత్సరంలో పాఠశాల పనిచేసిన 219 రోజులూ హాజరైందన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో సోఫియాను ఆయనతోపాటు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జక్కం రాజు, గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ సోఫియా చదువులో కూడా రాణిస్తూ ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సోఫియాకు 8వ తరగతి ఉపాధ్యాయుడు దంగేటి గోపాలకృష్ణ నగదు బహుమతి అందజేశారు. సోఫియాతోపాటు ఆమె తల్లిదండ్రులు కొల్లాటి శ్రీనివాస్, ధనలక్ష్మీ దంపతులను కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, కాజ పడమర సర్పంచ్ గుబ్బల వేణుగోపాలస్వామి, ఎంపీటీసీ జిల్లెళ్ళ రత్నరాజు, మాజీ ఎంపీటీసీ కొప్పినీడి సర్వేశ్వరరావు ఇతర గ్రామపెద్దలు అభినందించారు.

ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ తప్పనిసరి



వ్యాపారులకు ఫాస్టాక్ ట్రైనింగ్ సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఆహార పదార్థాలు అమ్మే వ్యాపారులంతా తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్‌తోపాటు ఫాస్టాక్ ట్రైనింగ్ పొందిన సర్టిఫికెట్ తీసుకోవాలని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ ఆహార భద్రతా సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో ఫాస్టాక్ ఫుడ్ సేఫ్టీ శిక్షణ, సర్టిఫికెట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆహార వ్యాపారులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఫాస్టాక్ ట్రైనింగ్ ఎగ్జిక్యూటివ్‌లు షాపులకు వచ్చిన సమయంలో వ్యాపారులు సహకరించాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ పూడి దేవిడ్సన్ మాట్లాడుతూ వ్యాపారులంతా ఆదాయమే మార్గం కాకుండా సురక్షితమైన, శుభ్రమైన ఆహారాన్ని ప్రజలకు అమ్మాలని కోరారు. కాయ్ వంజి బాబా గ్రామీణ్ వికాస్ మండల్ (కేవీజీవీఎం) జిల్లా టీం హెడ్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యాపారులంతా కల్తీని గుర్తించే సామర్థ్యాన్ని పెంచుకుని ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అమ్మాలన్నారు. కార్యక్రమంలో కేవీజీవీఎం ఎగ్జిక్యూటివ్స్ డి నవీన్, హేమంత్ పాల్గొన్నారు.

ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలి

భీమవరం: ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలని, సరైన గోనె సంచులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ధాన్యం పట్టుబడి సమయంలో సంచితో కలిపి 40 కిలోల 500 గ్రాముల తూకం వేయాలని అదనంగా 700 గ్రాములు తూస్తున్నారన్నారు. రైతులకు ఇచ్చే సంచుల్లో 40 శాతం చిరిగిపోయి ఉంటున్నాయని చిల్లులు లేని సంచులు సరఫరా చేయాలన్నారు.